# ధాన్యం కొనుగోలుకు పటిష్ట చర్యలు


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్,అక్టోబర్ 3: వానకాలం మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఖరీ ఫ్ మార్కెటింగ్ సీజన్ 2024-25 కు సంబంధించి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్, అపాయింట్మెంట్ ఆర్డర్ల ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వానకాలం మార్కెటింగ్ సీజన్ ధాన్యం కొనుగోలు సంబంధించిన అంశాలను వివరిస్తూ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన నాణ్య త ప్రమాణాలు, సన్న రకం ధాన్యం కొనుగోలుకు ఐదు వందల రూపాయలు బోనస్ తదితర అంశాలను వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సంబంధించి జిల్లాలో పటిష్ట కార్యాచరణ తీసుకోవాలన్నారు. 11,652 టీచర్ల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి విజయవంతంగా పరీక్షలు నిర్వహించి 1:3 కింద ఎంపిక చేసి ఫలితాలు ప్రకటించామన్నారు. దసరా కంటే ముందు టీచర్ల నియామకం పూర్తి కావాలని, జిల్లా కలెక్టర్లు దీనిని ప్రాధాన్యత అంశంగా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్యా, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ప్రవీణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, అధికారులు పాల్గొన్నారు.

### కుటుంబాల గుర్తింపు కోసమే..
# డిజిటల్ కార్డు సర్వే

నందారంలో పరిశీలించిన ఆర్డీవో రామ్మూర్తి


అక్కన్నపేట: నందారంలో చేస్తున్న డిజిటల్ కార్డు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మూర్తి

అక్కన్నపేట, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ కార్డు సర్వే కుటుంబాల గుర్తింపు కోసమేనని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి అన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా మండలంలోని నందారం గ్రామాన్ని ఎంపిక చేయగా, గురువారం గ్రామంలో రెవెన్యూ అధికారులు ఇంటింటా సర్వే నిర్వహించారు. కాగా, క్షేత్రస్థాయిలో కార్యక్రమా తీరును ఆర్డీవో పరిశీలించారు. తహసీల్దార్ అనంత రెడ్డి, గిర్దావరులు యాదగిరి, జాహెద్, అంగన్వాడీ టీచర్లు, అధికారులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో..**

గజ్వేల్, అక్టోబర్ 3: మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో కుటుంబ సభ్యులకు త్వరలోనే ప్రభుత్వం ఇచ్చే కార్డు కోసం గురువారం ఇంటింటి సర్వేను అధికారులు చేపట్టారు. మున్సిపల్ పరిధిలోని 17వ వార్డును పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడంతో అధికారులు సర్వే చేపట్టారు. ఈసర్వేలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ నర్సయ్య, కౌన్సిలర్ లక్ష్మీకిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో..**

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 3 : సంక్షేమ పథకాల అమలుకు ఫ్యామిలీ డిజిటల్‌కార్డును అందించేందుకు గానూ పైలెట్ ప్రాజెక్టుగా పట్టణాన్ని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డును ఎంపిక చేసిన అధికారులు నాలుగు బృందాలతో సర్వే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఒక్కో బృందం 75 కుటుంబాల చొప్పున సర్వే చేసేందుకు మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో బృందాలను అధికారులు నియమించారు. ఆయా బృందాలు ఇంటింటికి వెళ్లి కుటుంబాల సమాచారాన్ని సేకరించారు. సర్వే జరుగుతున్న తీరును హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి పరిశీలించారు. ఆయన కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ ఉన్నారు.

**సిద్దిపేటలో..**

సిద్దిపేట, అక్టోబర్ 3 : డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేలో భాగంగా పట్టణంలోని 34వ, వార్డులో అర్బన్ మండల తహసీల్దార్ సలీం ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల బృందం ఇంటింటా సర్వే నిర్వహించింది. సర్వేకు పైలెట్ ప్రాజెక్టు కింద 34 వార్డులో సర్వే నిర్వహించామన్నారు.

## కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌ను అమలు చేయాలి

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 3 : కాంగ్రెస్ ఎన్నికల ముందు వరంగల్ సభలో ప్రకటించిన రైతు డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కురెళ్లి జస్వంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన వాగ్ధానాలను నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఛలో కామారెడ్డి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతు, కౌలు రైతులకు ఎకరానికి 15 వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. చంద్రాగౌడ్, దుర్గారెడ్డి, నగేశ్, మహేందర్‌రెడ్డి, రాములు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## గంజాయి విక్రేతల అరెస్టు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 3 : గంజాయి వినియోగిస్తూ ఇతరులకు అమ్ముతున్న ఏడుగురు నిందితులను సిద్దిపేట టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన శశివర్ధన్, సురేశ్, రఘువంశీ దయాకర్, లక్ష్మణ్, రోహిత్ షాదుల్, నివాస్ విశాఖపట్నం, ధూల్‌పేట్‌లను నుంచి గంజాయి తక్కువ ధరకు కొనుగులు చేశారని తెలిపారు. గంజాయిని అధిక ధరకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేశారని చెప్పారు. ఈ క్రమంలో సర్కిల్ పరిధిలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద గంజాయి సేవిస్తూ ఇతరులకు విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసు సిబ్బందితో వెళ్లి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1040 గ్రాముల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. షాదుల్, నివాస్ పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ పర్యటన


సమస్యలను తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట, అక్టోబర్ 3 : బతుకమ్మ పండుగ దృష్ట్యా పలు వార్డుల్లో గుంతలను వెంటనే పూడ్చివేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించారు. కేసీఆర్ నగర్, ఎర్రచెరువు, కోమటి చెరువు, కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ ఇండ్ల కాలనీల్లో పర్యటించారు. విద్యుత్ దీపాలకు వెంటనే లైట్లు అమర్చాలన్నారు. కేసీఆర్ నగర్‌లో ఉన్న యూజీడీ సమస్యను వెంటనే పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లు బ్రహ్మం, బర్ల మల్లికార్జున్, సాయ న్న గారి సుందర్ పాల్గొన్నారు.

## దసరాకు ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

సిద్దిపేట, అక్టోబర్ 3 : దసరా పండుగకు ప్రభుత్వం నాలుగు డీఏలను ప్రకటించాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, విక్రంరెడ్డి అన్నారు. గురువారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బతుకమ్మ పండుగ సం దర్భంగా ఉద్యోగులకు ప్రభుత్వం ఐచ్ఛిక సెలవు కాకుండా సాధారణ సెలవును ప్రకటించాలన్నారు. డీఏల కోసం ఉద్యోగులు అందరూ ఎదురూ చూస్తున్నారన్నారు.

## ప్రజల రక్షణకు కార్డెన్ సెర్చ్

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 3 : ప్రజల రక్షణ.. భద్రత భావం కలిగించడానికి కమ్యూనిటీ కాంట్రాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గుండ్ల చెరువు, డబుల్ బెడ్ రూమ్స్ కాలనీలో గురువారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎలాంటి పేపర్లు లేని 14 వాహనాలను, కారు సీజ్ చేశారు. నార్కోటిక్ కిడ్స్‌ద్వారా ప్రమాదాస్పదంగా కనబడిన ఫెరోజ్ అనే యువకుడిని తనిఖీ చేయగా గంజాయి సేవించినట్లు రిపోర్ట్ వచ్చిందన్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ యువత గంజాయి, మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు నేరుస్తులు గానీ వచ్చి షెల్టర్ తీసుకుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో ప్రభుత్వం విఫలం

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, అక్టోబర్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి అడుగంటిందని, ప్రజా సంక్షేమం అటకెక్కిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. 10 నెలలుగా ఒక్కటంటే ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ సర్కారులో జరిగిన అభివృద్ధి పనులు తప్ప.. దుబ్బాకలో కొత్తగా జరిగిన అభివృద్ధి లేదన్నారు. గురువారం దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 50 మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితా భూంరెడ్డి అధ్యక్షతనలో జరిగిన సమావేశంలో మున్సిపల్ అభివృద్ధికి సంబంధించిన 13 ఎజెండా అంశాలను ప్రవేశపెట్టారు. 20 వార్డుల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభలో లేవనెత్తారు. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు దుబ్బాక పట్టణంతో పాటు పక్కనున్న వార్డులకు నిధులు కేటాయించాలని తీర్మానించారు. పండుగ సందర్భంగా చెరువు కట్టల సుందరీకరణతో పాటు బతుకమ్మ ఆడుకునేందుకు అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్, వైస్ చైర్మన్ సుగుణా బాలకిషన్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు రొట్టే రాజమౌళి, ఎల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, యాదగిరి, ఇల్లెందుల శ్రీనివాస్, స్వామి, రామస్వామిగౌడ్, శ్రీనివాస్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**నేడు దుబ్బాకలో అధికారులతో సమీక్ష**

బతుకమ్మ పండుగ సందర్భంగా శుక్రవారం దుబ్బాక ఐవోసీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పండుగ సందర్భంగా గ్రామీణా ప్రాంతాల్లో వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు ప్రభుత్వం కేటాయించాలని ఆయన కోరారు.

## ‘నల్లపోచమ్మ’ ఆలయ అభివృద్ధికి కృషి


నల్లపోచమ్మ ఆలయాన్ని సందర్శించిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, అక్టోబర్ 3 : మండలంలోని నాగపురి గ్రామ శివారులోని నల్లపోచమ్మ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాను కృషి చేస్తానని జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం నల్లపోచమ్మ ఆలయాన్ని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తుల వసతులను ఆలయ చైర్మన్ గూడెపు మహేశ్ మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన కొమ్మూరి మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న ప్రతి భక్తుడు నల్లపోచమ్మ, కొండపోచమ్మలను దర్శించుకుంటున్నారని, భక్తుల రద్దీకి తగ్గట్టుగా నల్లపోచమ్మ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణగౌడ్, డైరెక్టర్ కొమ్ము రవి, సీనియర్ నాయకుడు పర్వాటకం లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

## వర్గల్ విద్యాధరిక్షేత్రంలో పూజలు


బాలాత్రిపురాసుందరీదేవిరూపంలో వర్గల్ సరస్వతీమాత


అమ్మవారిని దర్శించుకున్న ప్రతాపరెడ్డి, నాయకులు

వర్గల్, అక్టోబర్ 3 : వర్గల్ విద్యాధరిణి శ్రీ సరస్వతీమాత ఆలయంలో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అట్టహాసంగా అంకురార్పణ పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయవ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో గణపతిపూజ, చండీహోమం ఇత్యాది పూజా క్రతువులు జరిగాయి. తొలిరోజు సరస్వతీ అమ్మవారు బాలాత్రిపురాసుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అంకురార్పణ పూజల్లో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, వర్గల్ ఫ్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మురళీగౌడ్ పాల్గొన్నారు.

## వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


మద్దూరులో దుర్గామాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 3 : మద్దూరు మండల కేంద్రంలోని రామాలయం యూత్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వద్ద దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అర్చకుడు పానుగంటి తిరుపతయ్య వైదిక నిర్వహణలో వివిధ అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. కార్యక్రమంలో చందా వెంకటేశం, కొరిగింజ బాలేశ్, యూత్ ప్రతినిధులు గాదె సురేశ్ కుమార్, బోయిని తిరుపతి, ఇరుమల్ల రాజు, అల్ల భరత్,ప్రవీణ్ కుమార్, చెంచల కరుణాకర్, గణేశ్, నంగి రాకేశ్ పాల్గొన్నారు.

**వర్గల్‌లో..**

వర్గల్, అక్టోబర్ 3 : వర్గల్ మండలంలోని ఆయా గ్రామాల్లో దేవీశరన్న రాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండపాల్లో దుర్గామాత పూజలు ప్రారంభమయ్యాయి. తున్కిఖల్సాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో పూజలు నిర్వహించారు.

**గజ్వేల్‌లో..**

గజ్వేల్, అక్టోబర్ 3 : గజ్వేల్ పట్టణంలో సూర్యవంశ ఆరెకటికే సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి మండపంలో గురువారం బాలత్రిపుర సందరీదేవి అలంకరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టణవాసులు దర్శించుకున్నారు.

**కొండపాకలో..**

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 3 : కొండపాక మండలంలోని మర్పడగలో విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు బాలా త్రిపురసుందరీగా భక్తులకు దర్శనమిచ్చింది. క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

**చేర్యాలలో..**

చేర్యాల, అక్టోబర్ 3 : మండలంలోని ఆకునూరు శ్రీ భవానీ రుద్రేశ్వర స్వామి వారి ఆలయంలో ఉల్లెంగల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఉల్లెంగల ట్రస్ట్ చైర్మన్ పద్మ ఏకానందం దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి బాలత్రిపుర సుందరీగా భక్తులకు దర్శనమిచ్చింది. ఏపీలోని విజయవాడ దుర్గాదేవి ఆలయంలో కొనసాగే పూజ కార్యక్రమాలను ఇక్కడ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగల ఏకానందం తెలిపారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం..


చెక్కు అందజేస్తున్న మండలాధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి

తొగుట, అక్టోబర్ 3 : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. తొగుటలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో బీఆర్‌ఎస్ కార్యకర్త చింత నర్సింహులు మృతిచెందగా, బీఆర్‌ఎస్ క్రియాశీలక సభ్యత్వం ద్వారా బీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే ఆదేశం మేరకు మృతుడి భార్యకు అందజేశారు. మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి, సుతారి రమేశ్, మాజీ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, బక్క కనకయ్య, సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి నాయకులు కంది రాంరెడ్డి, మంగ నర్సింహులు, పరమేశ్వర్‌రెడ్డి, రామెల్ల అనిల్, బోయిని శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, డీలర్ వెంకట్‌రెడ్డి, పబ్బతి వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మంగ యాదగిరి, చిక్కుడు రమేశ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి

సిద్దిపేట, అక్టోబర్ 3 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని జిల్లా రియల్ ఎస్టేట్స్ వ్యాపారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జంగం రాజాలింగం, రెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట పట్టణంలోని స్థానిక రియల్ ఎస్టేట్ కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి రాక ముందు ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేస్తామన్న కాంగ్రెస్ నేడు ఎల్‌ఆర్‌ఎస్ ఖజానా నింపుకోవడానికి ప్రయత్నం చేస్తున్నదన్నారు. భూముల విలువ పెంచవద్దన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం సరిగ్గా అనేక ఇబ్బందుల పడుతున్నామని మళ్లీ ఎల్‌ఆర్‌ఎస్ అంటే ములిగే నక్కపై తాటికాయ పడ్డట్లుందన్నారు. సమావేశంలో నాయకులు సంజీవ్, మల్లారెడ్డి, భగవాన్‌రెడ్డి, రంగయ్య,సంజీవ్, దేవేందర్‌గౌడ్, చిన్నా, సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీరామ్, శ్రీనివాస్,లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ..


మర్రిముచ్చాలలో బీఆర్‌ఎస్ నేత కిషన్‌ను ఓదారుస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి, అక్టోబర్ 3 : కొమురవెల్లి మండల బీఆర్‌ఎస్ నేత తలారీ కిషన్ తండ్రి, మాజీ ఎంపీపీ కీర్తన మామయ్య గాలయ్య మర్రిముచ్చాలలో అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. కొమురవెల్లి, చేర్యాల మండలాల బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## కార్పొరేట్ శక్తులకు మోదీ సర్కార్ దాసోహం


కొమురవెల్లిలో మహాసభల సూచికగా సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

కొమురవెల్లి, అక్టోబర్ 3 : సంక్షేమ పథకాలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడి దారులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఊడిగం చేస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కొమురవెల్లిలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల సూచికగా సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సార్ల యాద య్య, ఆరుట్ల దయానంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రైవేటుకరణ చేస్తున్నారని మండిపడ్డారు. బి.కృష్ణారెడ్డి, అత్తిని శారద, తాడూరి రవీందర్, అరుణ్ కుమార్, తేలు ఇస్తారి, వుల్లంపల్లి సాయిలు, మల్లేశం, మల్లయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

**ఐనాపూర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి**

మండలంలోని ఐనాపూర్‌లో బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో కనీస ఏర్పాట్లు చేయాలని గురువారం కొమురవెల్లి తహసీల్దార్ లక్ష్మీనారాయణకు సీపీఎం నాయకులు తేలు ఇస్తారి, వుల్లంపల్లి సాయిలు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు ఉన్నట్లు కొంత మంది అధికారులు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని, గ్రామంలో మాత్రం కనీస అవసరాలు గుంతలు పూడ్చడం, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. వెంటనే గ్రామంలో కనీస అవసరాలు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సున్నం యాదగిరి, సుక్క ఎల్లయ్య, పాశం చంద్రయ్య తదితరులు ఉన్నారు.

## యువకుడిపై కత్తితో దాడి

బెజ్జంకి, అక్టోబర్ 3 : మండల కేంద్రానికి చెందిన సోమని ప్రవీణ్ అనే యువకుడిపై బెజ్జంకికి చెందిన యువకులు కత్తితో దాడి చేసినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. సోమని ప్రవీణ్, వెల్పుల శ్రీనివాస్‌కు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. దీంతో ప్రవీణ్ కోరుట్ల నుంచి సొంత కారులో గురువారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు వెళ్తుండగా, మండలంలోని తోటపల్లి శివారులో వెల్పుల శ్రీనివాస్, శ్రీకాంత్, చందు, మరికొంత మంది యువకులు మరో కారుతో అడ్డగించి ప్రవీణ్‌పై కత్తితో దాడి చేశారు. కత్తి పోట్లతో గాయపడిన ప్రవీణ్‌ను మెరుగైన వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

సిద్దిపేట జిల్లాలో రెండోరోజు అటుకుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. వీధులన్నీ పాటలతో మార్మోగాయి. మహిళలు, యువతులు తీరొక్క పూలతో అందంగా బతుకమ్మను పేర్చి కూడళ్లలో ఉంచి చిన్నాపెద్దా కలిసి పాటలతో హోరెత్తించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ సందడి చేశారు. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. – సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, అక్టోబర్ 3


సిద్దిపేట లో బతుకమ్మతో యువతి


సిద్దిపేట కోమటి చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సిద్దిపేట కోమటి చెరువు లో నిమజ్జనం


సిద్దిపేట సీనర కాలనీలో..

## సైనికుడి కుటుంబ సభ్యులకు సన్మానం

కొమురవెల్లి, అక్టోబర్ 3 : మండలంలోని గౌరాయపల్లిలో ఆశ కార్యకర్త ప్రమీల చిన్న కుమారుడు మనోహర్‌రెడ్డిని ఆర్మీలోకి పంపడంతో గురువారం ఆర్మీసెల్ కన్వీనర్ రిటైర్డ్ ఆర్మీ నీల చంద్రం ఆధ్వర్యంలో సైనికుడు మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత ఆకాంక్షలను పక్కనబెట్టి దేశ సరిహద్దు భద్రతపై వెళ్లిన సైనిక కుటుంబాలను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జనగామ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజమణి శ్రీనివాస్, చల్ల రామ్‌రెడ్డి, కరుణాకర్ తదితరులు ఉన్నారు.


## బతుకమ్మ ఆడేందుకు స్థలం కేటాయించాలి

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 3 : మహిళలకు బతుకమ్మ ఆడేందుకు స్థలం కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాలనర్సయ్య డిమాండ్ చేశారు. గురువారం కొండపాక మండలంలోని వెలికట్టె సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సూచికైన బతుకమ్మ పండుగ అని అలాంటి బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలకు బతుకమ్మ ఆడేందకు స్థలం లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ ఆడేందకు మహిళలకు గ్రామంలో ప్రభుత్వ స్థలం కేటాయించాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. సమావేశంలో పెరుగు కొమురయ్య, అమ్ముల కనకయ్య, పరశురాములు, చంద్రయ్య, బాలలక్ష్మి, కొమురయ్య తదితరులు ఉన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

గజ్వేల్, అక్టోబర్ 3 : మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోని ఎంబరి రామచంద్రానికి చెందిన ఆఫీసులో గురువారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సయుక్తంగా దాడి చేశారు. ఈదాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నగదు రూ.77,180, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో గజ్వేల్ పట్టణానికి చెందిన ఎంబరి రామచంద్రం, ఎల్దండి వెంకట్‌రెడ్డి, తాటికొండ బలరాంరెడ్డి, గడీల కరుణాకర్‌రెడ్డి, చేతిరెడ్డి చిన్నరెడ్డి, రమేశ్ ఉన్నారు.

## లావణ్య మృతి బాధాకరం


నివాళులర్పిస్తున్న మండలాధ్యక్షుడు రాంరెడ్డి

తొగుట, అక్టోబర్ 3 : మండలంలోని చందాపూర్‌కు చెందిన శేర్ల యాదగిరి భార్య లావణ్య (33) తీవ్ర జ్వరంతో బాధపడుతూ యశోదలో చికిత్స పొందుతూ విషమించి మృతి చెందింది. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి సంతాపం తెలిపారు. గురువారం ఉదయం చందాపూర్‌లో లావణ్య మృతదేహానికి నివాళులర్పించి, యాదగిరిని పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నర్సెట్టి మల్లేశం, గ్రామ అధ్యక్షులు జనగామ సుభాష్‌గౌడ్, నాయకులు డబ్బికారి పెంటోజీ, బొడ్డు నర్సింహులు, కిషన్, బండారి స్వా మిగౌడ్, సుతారి రాంబాబు, ఎంగలి నరేందర్ తదితరులు ఉన్నారు.

## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి

చేర్యాల, అక్టోబర్ 3 : సంపద సృష్టించే కార్మిక, కర్షక అనుకూల విధానాలను వీడి పెట్టుబడిదారి, కార్పొరేట్ విధానాలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలను ప్రతిఘటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాళ్లబండి శశిధర్ కోరారు. మండలంలోని నాగపురి గ్రామంలో సీపీఎం పార్టీ మహాసభ మోకు దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కార్మికవర్గం, రైతులు, శ్రామిక ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం గ్రామశాఖ నూతన కా ర్యదర్శిగా మోకు ఇంద్రం, సోషల్ మీడి యా ఇన్‌చార్జిగా భూలక్ష్మీ నర్సింగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభలో మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, గొర్రె శ్రీనివాస్, కనకయ్య, బోయిన మల్లేశం, రమేశ్, బాలు, ఇస్మాయిల్, చంద్రం, చం ద్రయ్య, లక్ష్మయ్య, శ్రీను, రమేశ్, కృష్ణమూ ర్తి పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

చేర్యాల, అక్టోబర్ 3 : మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులోని ఇందిరమ్మ కాలనీలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి శ్రీధర్‌రెడ్డి రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేసి ప్రజలకు వసతి కల్పించాలని సూచించారు. అధికారులు, పాలకవర్గం రోడ్డు నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ చెవిటి లింగం, కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ నాగేందర్, మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.